క్లుప్తంగా

నేడు పంటల సాగుపై అవగాహన

కమాన్‌పూర్: గుండారం, నాగారం, సిద్దిపల్లె గ్రామ పంచాయతీల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

మోతాదుకు మించి పురుగుల మందులు వాడొద్దు



మాట్లాడుతున్న వెంకన్న

ధర్మారం: రైతులు తమ పంట పొలాల్లో మోతాదుకు మించి పురుగుల మందులను వాడొద్దని కేవీకే రామగిరి ఖిలా శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకన్న, డాక్టర్ సురేశ్ సూచించారు. దొంగతుర్తి, బొమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో కేవీకే రామగిరి ఖిలా ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కింద ముందస్తు వానాకాలం పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ శ్రీనాథ్, కేవీకే రామగిరి ఖిలా శాస్త్రవేత్తలు వెంకన్న, కిరణ్, హైదరాబాద్ ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్తలు సురేశ్, బాబ్జీ, పాల్‌యాదవ్ పాల్గొని రైతులకు పంటల సాగు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. రైతులు ఆధీకృత విత్తన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు తీసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఉద్యాన శాఖ అధికారి మహేశ్, ఏఈవోలు వినిత్, రాహుల్, అఖిల, రైతులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏవో సతీశ్

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ(రైతుల భూరిజిస్ట్రేషన్) విషయమై మండల వ్యవసాయాధికారి కల్వల సతీశ్ రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ పౌరుడికి ఆధార్ మాదిరిగా తమ భూవివరాలను సులభంగా గుర్తించేలా విశిష్ట సంఖ్యను కేటాయించనున్నారని, తమ భూవివరాలకు తమ ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాల్సి ఉంటుందన్నారు. ఏఈవోలు రమేశ్, హరీశ్ హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న సురేశ్

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు కెపాసిటి బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ సురేశ్ హాజరై క్రిటికల్ లెనెస్స్, ఎక్స్‌పరిమెంట్స్, జన్యుశాస్త్రం, నైట్రోజన్ సైకిల్ డార్విన్ సిద్ధాంతం అంశాలపై వివరించారు. కోర్స్ డైరెక్టర్ కవిత, రిసోర్స్‌పర్సన్లు నరేశ్, కుమార్, సాధన, ప్రత్యూష, సీఆర్పీలు కిరణ్‌కుమార్, మంజుల, ఉపాధ్యాయులున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జూలపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సూచించారు. మండల కేంద్రంలో చేపట్టిన పారిశుధ్య పనులు, కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రం, డంపింగ్ యార్డు పనులను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు. ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కారోబార్ ఉన్నారు.

పనితీరుకు పురస్కారం



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ గిరిజ

సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఉత్తమ మార్కులు సాధించగా సీఎం రేవంత్‌రెడ్డి అవార్డు అందజేశారు. ప్రిన్సిపాల్ గిరిజ సీఎం నుంచి అవార్డు అందుకున్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఉత్తమ మార్కులు సాధించినందుకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం నుంచి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుతోపాటు రూ.5లక్షల ప్రోత్సాహకం అందుకున్నట్లు వివరించారు.

నెల రోజులైనా ఎందుకీ నిర్లక్ష్యం?

- బూడిద బాధితులకు నశిస్తున్న ఓపిక
- ఆందోళనలకు సిద్ధమవుతున్న వైనం



అక్బర్‌నగర్‌లోని ఎన్టీపీసీ బూడిద పైపులైన్

రామగుండం: ఒడ్డు దాటే వరకు ఓడ మల్లన్న.. ఒడ్డుకు చేరిన తర్వాత తెడ్డు మల్లన్న అన్న సామెత ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులకు సరిగ్గా వర్తిస్తుంది. గత నెల 23న రాత్రి ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం నుంచి అక్బర్‌నగర్ సమీపంలోని యాష్‌పాండ్‌లోకి ఉన్న బూడిద పైపులైన్ పగిలి పదుల సంఖ్యలో నివాసాలు బూడిదతో ముంచెత్తి 37 రోజులు గడుస్తున్నా.. బాధిత కుటుంబాలకు ఒప్పుకున్నవిధంగా న్యాయం చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడంతో బాధిత కుటుంబాల్లో ఓపిక నశించి ఎన్టీపీసీ వైఖరిపై ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఘటన జరిగిన మరుసటి రోజు పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన క్రమంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ వైఖరిపై దుమ్మెత్తిపోశారు. అదే సమయంలో బాధిత కుటుంబాలకు జరిగిన నష్టం, చెల్లించాల్సిన పరిహారం, బాధిత కుటుంబాల్లో అర్హులైన వారికి ఒప్పంద కార్మికుడిగా ఉపాధి కల్పించడం, ఇంటింటికి శుద్ధ జలాలు అందించడం, ముఖ్యంగా పైపులైన్ పక్క నుంచి రిటైనింగ్ వాల్ నిర్మించి గృహాలకు రక్షణ కల్పించడం, రాజీవ్ రహదారి కుందనపల్లి ఎక్స్‌రోడ్ నుంచి యాష్‌పాండ్ వరకు రహదారి నిర్మాణం చేపట్టడం, బూడిదతో చెడిపోయిన సామగ్రిని కొనుగోలు చేసి ఇవ్వడం తదితర డిమాండ్లతో కూడిన నివేదికను బాధితులు అంతర్గాం తహసీల్దార్ తూం రవీందర్‌పటేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అయోధ్యసింగ్‌ఠాకూర్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై బోయ వెంకటస్వామి, సీనియర్ కాంట్రాక్టర్ కాంతాల శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ అధికారులకు నివేదించారు. దీనిపై సంబంధిత అధికారులు నెల రోజుల్లోగా తమ డిమాండ్లను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడతామని అధికారుల సాక్షిగా హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు నాజియాసుల్తానా పలుమార్లు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నా.. దేఖింగే.. ఖరింగే అనే సమాధానమే తప్ప ఎలాంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని వాపోయారు.

పోతరాజు విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన పోతరాజు విగ్రహం



పొత్కపల్లిలో బీజేపీ నాయకుల రాస్తారోకో

ఓదెల: పొత్కపల్లి గ్రామంలోని పోచమ్మ గుడిలో పోతరాజు లింగేశ్వరస్వామి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బస్టాండు సమీపంలోని పోచమ్మ గుడి ముందున్న పోతరాజు విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో రెండు ముక్కలైంది. గురువారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామంలో చర్చనీయాంశమైంది. వెంటనే పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే ఎస్సై ఆధ్వర్యంలో ప్రధాన రహదారికిరువైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

రాస్తారోకో..

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు గంటసేపు రాస్తారోకో చేశారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పులి కొంరయ్య, శనిగరపు రమేశ్, పుల్లూరి పృథ్వీరాజ్, తీర్థాల కుమార్, దాత రాకేశ్, రాజేందర్, అశోక్, రాజు, భిక్షపతి పాల్గొన్నారు.

పరిశోధనలు పారదర్శకంగా ఉండాలి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: శాంతిభద్రతల విషయంలో పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశించారు. కమిషనరేట్‌లో గురువారం పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రధానంగా మహిళలపై జరిగిన నేరాల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని, నిందితులకు శిక్షలు పడేలా సాక్ష్యాధారాలను కోర్టుల్లో ప్రవేశ పెట్టాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. దొంగతనాల నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగలను గుర్తించడంతో పాటు సొత్తును స్వాధీనం చేసుకోవడంలో సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని అన్నారు. బక్రీద్ సందర్భంగా శాంతికమిటీ సమావేశం నిర్వహించి తగిన సూచనలు చేయాలని అన్నారు. పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, మంచిర్యాల, పెద్దపల్లి, జైపూర్, బెల్లంపల్లి, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, రమేశ్, ప్రకాశ్, కృష్ణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగుకు గ్రీన్‌సిగ్నల్



రైల్వే శాఖ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వంశీకృష్ణ, వివేక్

ఓదెల: కరీంనగర్ నుంచి తిరుపతి మధ్యలో నడిచే ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లిలో ఆపాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ రైల్వే శాఖ జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం సమర్పించగా.. హాల్టింగుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గురువారం ఓదెల మండల కాంగ్రెస్ నాయకులు ఆవుల ముత్తేశ్వర్, గొస్కె రాజేశం, నోముల మాధవరెడ్డి, దొడ్డె స్వామి, మాటూరి రవి హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు



ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. సుల్తాన్‌పూర్, బుర్హన్మియాపేట, నర్సాపూర్‌లో గురువారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి మాట్లాడారు. నిబంధనలకు లోబడి ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందుకోసం ఐదు విడతల్లో బిల్లులు మంజూరు చేస్తామని వివరించారు. తహసీల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఆర్షనపెల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, మాజీ ఉప సర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెద్దపల్లిరూరల్: మండలంలో ఉపాధిహామీ పథకం కింద పనులు జోరందుకున్నాయి. కూలీలతో ఎస్సారెస్పీ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, పేరుకుపోయిన పూడిక మట్టిని తొలగిస్తున్నారు. పెద్దకల్వలలో గురువారం సాగుతున్న పనులను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి నిశాంత్‌రావు తదితరులున్నారు.

రైతు సంక్షేమానికే ప్రాధాన్యం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికే ప్రాధాన్యమిస్తోందని నేతలు అన్నారు. రైతులు పండించిన పంట దిగుబడులకు మద్దతు ధర పెంచుతూ ప్రధాని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు. జెండా కూడలిలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాకేశ్, రమేశ్, రాజేశ్వర్‌రావు, రాజగోపాల్, శ్రీనివాస్, యాంసాని వేణు, సంపత్‌రావు, కిరణ్ తదితరులున్నారు.

మజ్జిగ పంపిణీ



గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రధాన చౌరస్తాలో రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రంలో గురువారం తూముల అశోక్‌రావు సహకారంతో 29వ రోజు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ సభ్యులు చింతల రాజిరెడ్డి, తూముల రాజేశ్వర్‌రావు, చందుపట్ల మల్లారెడ్డి, కోలేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్



నియామక పత్రం అందుకుంటున్న ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ: బాక్సింగ్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోతనకాలనీకి చెందిన బండారి ప్రసాద్‌ను నియమిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ధనంజయ్‌గౌడ్ తెలిపారు. ఈనెల 27న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఒలింపిక్ భవనంలో తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ.. బాక్సింగ్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

నిస్వార్థంగా సేవ చేస్తేనే గుర్తింపు



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి

సుల్తానాబాద్‌రూరల్: ఉద్యోగులు నిస్వార్థంగా సేవ చేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా వైద్యాధికారిణి అన్న ప్రసన్నకుమారి అన్నారు. గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డి విరమణ కార్యక్రమాన్ని గురువారం పీహెచ్‌సీలోని సమావేశ హాల్‌లో నిర్వహించారు. డీఎంహెచ్‌వో, డాక్టర్లు ఉదయ్‌కుమార్, అనుదీప్, ప్రోగ్రాం అధికారులు దేవిసింగ్, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, వాణిశ్రీ, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది వెంకట్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

నీటి ట్యాంక్ నిర్మాణానికి నిధులు

ఓదెల: మండల కేంద్రంలో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి కలెక్టర్ నిధుల నుంచి రూ.90 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే విజయరమణారావు గురువారం తెలిపారు. వాటర్ ట్యాంక్ లేక ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తీసుకొచ్చారని, సమస్యను కలెక్టర్‌కు విన్నవించగా నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే వివరించారు. పనులు వెంటనే చేపట్టేలా మిషన్ భగీరథ ఈఈకి కలెక్టర్ ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు.

రోడ్డుపై వైట్ లైన్స్ ఏర్పాటు



రామగుండం: ఇటీవల అంతర్గాం జంక్షన్‌తోపాటు ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా వద్ద అతివేగంతో వాహనాల రాకపోకలతో పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా.. పలువురు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బ్రేకర్లు వేయించాలని పలువురు తహసీల్దార్ తూం రవీందర్‌పటేల్‌ను కోరారు. స్పందించిన తహసీల్దార్ సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించగా.. గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎట్టకేలకు ప్రధాన రహదారిపై రబ్బర్ గీతలు(రంబుల్ స్ట్రిప్స్/స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేశారు.



జూలపల్లి: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేసేందుకు రూ.లక్షలు వెచ్చించి తీసుకొచ్చిన ప్యాడీ క్లీనర్లు కొనుగోలు కేంద్రాలకు ఇవ్వకపోవడంతో.. రైతులు వాడక నిరుపయోగంగా మారాయి. ఈ వర్షాకాలంలో వానకు తడిసి తుప్పు పట్టి ప్రజాధనం వృథాగా మారుతోందని మెషనరీని చూసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించాలని రైతులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

సీబీఎస్‌ఈ స్కూల్ ప్రారంభంపై సమీక్ష



మాట్లాడుతున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: సింగరేణిలో సీబీఎస్‌ఈ మోడల్ స్కూల్ ప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య ఆదేశించారు. గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 12న సింగరేణి సీఅండ్ఎండీ బలరాం చేతుల మీదుగా ప్రారంభోత్సవ చేయనున్నామని తెలిపారు. ప్రవేశాల తీరు, సిబ్బంది నియామకం తదితర విషయాలపై ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాస్‌తో చర్చించారు. ఎస్ఓటూ జీఎం రాముడు, ఏరియా రక్షణ అధికారి సంతోష్‌కుమార్, కరెస్పాండెంట్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసమే టీబీజీకేఎస్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న మిర్యాల రాజిరెడ్డి

రామగిరి: సింగరేణి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపింది టీబీజీకేఎస్ అని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. పిట్ సెక్రటరీ వేముల రవిశంకర్ అధ్యక్షతన ఓసీపీ– 2పై గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌ను సాధించి యువ కార్మికులకు అండగా నిలబడ్డామన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం, హక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉద్యోగాలు, రూ.10లక్షల ఇంటి రుణం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, 16 శాతం నుంచి 32 శాతం వరకు లాభాల వాటా, క్వార్టర్లకు ఏసీ సదుపాయం, ఒకశాతం విద్యుత్ చార్జీల మినహాయింపు లాంటివి అనేక సదుపాయాలు సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం మినిస్టీరియల్ స్టాఫ్ క్లరికల్ సిబ్బంది, సీనియర్ అసిస్టెంట్లు ఎండీ షరీఫ్‌తోపాటు సుమారు 20 మంది కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో చేరారు. వారికి రాజిరెడ్డి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. షరీఫ్‌ను ఆర్జీ–3, ఏపీఏ క్లరికల్ స్టాఫ్ ఇన్‌చార్జిగా నియమించారు. నాయకులు నాగేల్లి సాంబయ్య, పింగళి సంపత్‌రెడి, గంద్ర శేషగిరిరావు, పరిష బక్కయ్య, దేవ శ్రీనివాస్, ఈసంపల్లి రమేశ్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దాసరి మల్లేశ్, వీరగోని సంతోష్, గండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

రామగిరి: ఏపీఏ డివిజన్ హెచ్ఎంఎస్ నూతన కమిటీని ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ప్రకటించారు. సెంటినరీకాలనీలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో యూనియన్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ప్రకటించారు. బ్రాంచ్ సెక్రటరీగా మహేశ్, పిట్ సెక్రటరీగా రాజశేఖర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్, రామగుండం రీజియన్ సెక్రటరీ డి.రాజలింగం, నాయకులు గోషిక అశోక్, శాంతి స్వరూప్, కిరణ్, క్వాజీ మహమ్మద్ ఇస్మాయిల్ నిజామీ పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

సుల్తానాబాద్‌రూరల్: భూపతిపూర్‌లో గురువారం డీఎల్‌పీవో వేణుగోపాల్ విచారణ చేపట్టారు. భూపతిపూర్ శివారులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వం భూమిలో కంటెనర్ పెట్టి హోటల్ నడిపిస్తున్నారని కలెక్టర్‌కు ఎస్సీకాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కాలనీవాసులను వివరాలడిగి తెలుసుకోవడంతోపాటు విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీవో తెలిపారు. ఎంపీవో సమ్మిరెడ్డి, కార్యదర్శులున్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీశ్

కమాన్‌పూర్: జూలపల్లి గ్రామంలో చేపట్టిన పారిశుధ్య పనులను మంథని డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ గురువారం పరిశీలించారు. పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వన నర్సరీ, డంప్ యార్డులను పరిశీలించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దని అన్నారు. పంచాయతీ కార్యదర్శి శంకర్ ఉన్నారు.

బతకాలనే సంకల్పముంటే..



రామగుండం: బతకాలనే సంకల్పముంటే దానిముందు ఏదీ అడ్డు రాదని నిరూపిస్తోంది ఓ చెట్టు. స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట వీధిలో మూడేళ్ల క్రితం రోడ్డు వెడల్పులో భాగంగా ఓ భారీ వేప వృక్షాన్ని నరికేశారు. మొద్దళ్ల నుంచి తొలగించలేదు. ఫలితంగా ఇటీవల కురిసిన వర్షాలతో మొద్దళ్ల నుంచి వేప చిగురిస్తుండడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.